క్లుప్తంగా

ట్రై సైకిల్ అందజేత



పెనమలూరు: రోడ్డు ప్రమాదానికి గురై కాలు కోల్పోయిన వ్యక్తికి మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ సాయం అందించింది. యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకురాలు వీరంకి కీర్తి శుక్రవారం వివరాలు తెలుపుతూ గ్రామానికి చెందిన నాగుర రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడని అన్నారు. దీంతో అతను ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమ సంస్థ ద్వారా నాగురకు ట్రై సైకిల్‌తో పాటు నిత్యావసర సరుకులు ఇచ్చామని తెలిపారు. తమ సంస్థ ద్వారా గత పదేళ్లుగా రోడ్డు పక్కన నివశించే అనాథలకు అన్నదానం చేస్తున్నామని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



ఉంగుటూరు: ప్రతి ఒక్కరికి పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా శిశు సంరక్షణ అధికారి మానిషా సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల ఘటనలు తరచూ ఎక్కడో ఒక చోట జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలు అడ్డుకునేందుకు ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులను సమావేశపరచి పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఎంఈఓ-2 సాంబశివరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, మండలంలోని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన



గన్నవరం రూరల్: మండలంలోని బీబీగూడెం -గొల్లనపల్లి రోడ్డు మరమ్మతుల నిర్వహణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 20 లక్షలతో రహదారికి మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. బీబీగూడెం ఫ్లై ఓవర్ నుంచి తోటపల్లి వరకూ 9.4కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులతో ప్రజలకు సౌకర్యం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయపాటి బసవపూర్ణయ్య, బోయపాటి మురళీకృష్ణ, దొంతు చిన్న, పడమట పాండు రంగారావు, వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మి, పొలడుగు నాని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాలపై కఠిన చర్యలు



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో అనధికార కట్టడాలపై కఠిన చర్యలు ఉంటాయని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కమిషనర్ శుక్రవారం వివరాలు తెలుపుతూ.. కానూరులో బందరు రోడ్డు పక్కన 3వ అంతస్తు అక్రమంగా నిర్మాణం చేయడానికి సెంట్రింగ్ పెట్టారన్నారు. మున్సిపాలిటీ, ఏపీ సీఆర్‌డీఏ అధికారులు కలిసి అనధికార నిర్మాణాలు తొలగించామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు ప్లాన్ ప్రకారమే చేయాలని లేని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేయరాదని హెచ్చరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కుమారుడి అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన బిరకా లక్ష్మీ కుమారుడు శ్యామ్‌కుమార్ సూర్యారావుపేటలోకి కార్ సరీ్వస్ సెంటర్లో పనిచేస్తుంటాడు. ఈ నెల 28వ తేదీన పనికి వెళ్లిన తమ కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలి



డాక్టర్లకు రక్షణ లేదు. పని చేసే ప్రదేశంలో రక్షణ లేకపోతే ఎలా? కోల్‌కతా సంఘటనపై ప్రభుత్వంతో పాటు సొసైటీ కూడా బాధ్యత వహించాలి. లేకుంటే మహిళా డాక్టర్లుగా పని చేసే పరిస్థితి లేకుండా పోతుంది. ఉన్నత చదువులు చదివి సేవా రంగంలో పని చేస్తున్న మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి.

– సీహెచ్ కస్తూరి, హౌస్ సర్జన్, చిన అవుటపల్లి



డాక్టర్లకు రక్షణ లేకపోవడం దయనీయం



కోల్‌కతా దారుణంతో ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై దాడులు జరగడం, శిబిరాలు ధ్వంసం చేయడం దారుణం. డాక్టర్లుగా సేవలందిస్తున్న వారికి రక్షణ లేకపోవడం దయనీయం. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి దేశవ్యాప్తంగా మహిళా డాక్టర్లు, నర్సుల రక్షణపై పటిష్ట చట్టాలు అమలు చేయాలి.

– వల్లభనేని ఇందు, డెంటల్ హౌస్ సర్జన్

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

- ఉయ్యూరు ఆర్డీఓ రాజు
- పలు ప్రాంతాల్లో వన మహోత్సవం
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉయ్యూరు: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి వాటి పెంపకం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో వన మహోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, డీవైఈఓ పద్మారాణి మొక్కలు నాటారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వనం-మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాదంపాడులో సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం, నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. సర్పంచ్‌లు బాలాజీ గంగారత్నం, రంగారావు మాట్లాడుతూ హరితాంధ్ర కోసం అడుగులు వేసి భవితకు పచ్చదనం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణంలో సమతుల్యం లోపించడంతో అనేక విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ నివాసాలు, పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్‌నాథ్, రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని వీఎస్ సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పాఠశాలలో శుక్రవారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఆర్డీఓ రాజు

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో క్రెడాయ్ ఆధ్వర్యాన పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామంలోని పలు కాలనీల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల పర్యావరణంలో సమతౌల్యం పాటించగలుగుతామని అన్నారు. అయితే అడవులు నరకడం, కాలుష్యం పెరగడంతో భూమిపై వాతావరణం వేడెక్కి మానవాళికి చాలా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భూమిని కాపాడుకోవాలని అన్నారు. భవిష్యత్తులో పెనమలూరు నియోజకవర్గంలో మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, క్రెడాయ్ సభ్యులు దాసరి రాంబాబు, వైవీ రామారావు, సతీష్‌బాబు, శ్రీధర్, తుమ్మల వంశీ, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్, సాయిసుధ, పసుపులేటి భాస్కర్ పాల్గొన్నారు. కాగా యనమలకుదురు కొండపై శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఈఓ ఎం.గంగాధరరావు, ఆలయ పూజారి సాగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సచివాలయాల ప్రాంగణంలో టీడీపీ నేతలు ముప్పవరపు నారాయణ, అనంతనేని ఆజాద్ మొక్కలు నాటారు.



నిడమానూరులో మొక్క నాటుతున్న సర్పంచ్ శీలం రంగారావు



సెయింట్‌జాన్స్‌లో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్, సిబ్బంది

ఏటిపాయకు పోటెత్తిన వరద

కంకిపాడు: ఏటిపాయకు వరదనీరు పోటెత్తింది. పరవళ్లు తొక్కుతూ వరదనీరు సముద్రంలోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరదనీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం 3.21 లక్షలు క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో కృష్ణానది ఏటిపాయ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి ప్రవహిస్తున్న కృష్ణానది ఏటిపాయ వరద నీటితో నిండిపోయింది. ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు వెళ్తోంది. కాసరనేనివారిపాలెం వద్ద ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. కరకట్ట నుంచి మద్దూరు, కాసరనేనివారిపాలెం ఏటిపాయలకు వెళ్లే రోడ్డు మార్గానికి వరద చేరింది. ఇంకా వరదనీటి విడుదల పెరిగే అవకాశం ఉండటంతో ఏటి ఒడ్డున సాగులో ఉన్న వరి, పసుపు, కంద, తమలపాకు వంటి పంట పొలాలు ముంపునకు గురయ్యే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గండం గట్టెక్కితే చాలని రైతులు వేడుకుంటున్నారు.

కొనసాగుతున్న గస్తీ

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఏటి ఒడ్డున గస్తీ నిర్వహిస్తున్నారు. ఏటిపాయలోకి రాకపోకలను నిలిపివేశారు. పశువులు, జీవాలను సైతం మేతకు వెళ్లకుండా ఆదేశాలిచ్చారు. ఇప్పటికే మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి భద్రపర్చుకున్నారు. అయితే వరద ఉధృతంగా వస్తుండటంతో ఏటి ఒడ్డున మత్స్యకారులు వలలు వేసి చేపల వేట సాగిస్తున్నారు. ఏటిపాయ వద్ద తహసీల్దార్ భావన్నారాయణ పర్యవేక్షణలో వీఆర్‌ఓ బండ్రెడ్డి నాగిరెడ్డి గస్తీ నిర్వహిస్తున్నారు.



కాసరనేనివారిపాలెం వద్ద శివాలయం చుట్టూ చేరిన వరదనీరు



వరదనీటిలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుడు

ఎడతెరపి లేకుండా వర్షం

కంకిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ముసురు పట్టేసింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. కంకిపాడు ప్రధాన సెంటరులోని బస్టాండు పరిసరాలు, రైతుబజారు, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాల్లో వర్షపునీరు నిలిచింది. గోసాల ప్రధాన సెంటరు, కంకిపాడు, పునాదిపాడు అండర్ పాస్‌లు, సర్వీసు రోడ్లలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం

ఉయ్యూరు: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. ఆకాశం మేఘావృతమై గురువారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి తోడు గాలులు వీయడంతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా వర్షం పంటలకు జీవం పోసినట్లయ్యింది.



గోసాల ప్రధాన సెంటరులో నిలిచిన వర్షపునీరు

ఆకట్టుకున్న వాగ్గేయ కీర్తనలు

విజయవాడ కల్చరల్: లయ నాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణోత్సవాల సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో కేవీ కిషోర్, సంగీత విద్వాంసురాలు కుందుర్తి మాధవి, ఎం.కీర్తన వాగ్గేయకార కీర్తనలు మధురంగా ఆలపించారు. పి.జయతి, అరవింద్, కార్తికేయ ఆదినారాయణ వాద్య సహకారం అందించారు. సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): గురునానక్‌కాలనీలోని గురుద్వార్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో స్వప్న నేత్ర వైద్యశాలకు చెందిన డాక్టర్ ఇండ్ల స్వప్న పాల్గొని ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గడ్డి నివారణ మందు స్ప్రే

నున్న(విజయవాడరూరల్): ఇటీవల కురుస్తున్న వర్షాలకు నున్న గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన గడ్డిని నివారించేందుకు శుక్రవారం గడ్డి మందును గ్రామ పంచాయతీ స్ప్రేయింగ్ చేసింది. కాలం చేసిన వారిని సమాధి చేసేందుకు అసౌకర్యంగా ఉందని గ్రామంలోని ఎస్సీలు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేయడంతో గ్రామ కార్యదర్శి జిటివి. రమణ గడ్డి నివారణ మందును స్ప్రే చేయించారు.

పింఛన్ సొమ్ము విడుదల

కంకిపాడు: సామాజిక పింఛన్ సొమ్ము విడుదలైందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 9,104 మంది పింఛన్‌దారులకు రూ. 3.80 కోట్లు విడుదలైందని అన్నారు. ఈ మొత్తాన్ని సిబ్బంది ద్వారా శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కంకిపాడు లాకు గూడెం పరిధిలోని మండల పరిషత్ పాఠశాల, సాయిబాబా ఆలయ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పర్యవేక్షించి, లబ్ధిదారులకు అందిస్తారని పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకుడదనే లక్ష్యంతో తోచిన సాయం అందిస్తున్నామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడుకు చెందిన పర్వతనేని షణ్ముఖ సాయి ఆదిత్య బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ఫీజు చెల్లించేందుకు కుటుంబానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో మానవత సంస్థను ఆశ్రయించింది. దీంతో మానవత సభ్యులు తక్షణమే స్పందించి విద్యార్థికి రూ. 10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని స్థానిక మానవత కార్యాలయంలో శుక్రవారం పర్వతనేని షణ్ముఖ సాయి ఆదిత్యకు అందించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు గూడపాటి జయరామచంద్రరావు, పొట్లూరి శేషాచలం, వేగిరెడ్డి సూర్యనారాయణ, కూరెళ్ల సుబ్బాచారి, పాబోలు గణేష్, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ స్కీం రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ డిమాండ్ చే శారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ వెంకట శివయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి తమ వాటా లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని దేశ వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం దిగివచ్చి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. గతంలో జీపీఎస్ స్కీమ్‌ను వ్యతిరేకించిన టీడీపీ ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను కూడా వ్యతిరేకించాలని సంఘం రాష్ట్ర కౌన్సిలర్ పి. ప్రసాదరావు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు జీవీ రవిబాబు, తాతా శ్రీనివాస్, శివప్రసాద్, బీ జ్ఞానానందం, బాలశౌరి, చలపతిరావు, రంగారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



యనమలకుదురులో శ్రీపార్వతీదేవి అమ్మవారు



గన్నవరంలో వరలక్ష్మీదేవిగా లక్ష్మీతిరుపతమ్మ



పేరంటాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం పురస్కరించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో వ్రతాలకు హాజరయ్యారు. వ్రతాల అనంతరం ఆలయ అధికారులు పసుపు, కుంకుమ, రవిక, గాజులు, పండ్లు, తాంబూలం భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి పర్యవేక్షించారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధతలో పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ పార్వతీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. విశేష అలంకరణ తర్వాత పూజలు నిర్వహించి చండీహోమం చేశారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన అమ్మవారిని వరలక్ష్మీదేవీగా అలంకరించారు. తొలుత శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్తరం జరిపారు. గ్రామ పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను (మహాలక్ష్మీ)కి పూజలు చేశారు. సాయంత్రం కోలాట ప్రదర్శన నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ సహస్రనామ పారాయణం వచ్చే నెల 2న ముగుస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. జాస్తి ఫణి, కాసరనేని నాని, జాస్తి సీతయ్యచౌదరి, పొట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు, నర్రా గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక యాదవ రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బాపులపాడులో ఇంటింటి ఫీవర్ సర్వే

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దోమల ద్వారా వ్యాప్తి చెందే విష జర్వాలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రామారావు అన్నారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామంలో పర్యటించిన డాక్టర్ రామారావు ప్రజలతో ముచ్చటించి, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రతి శుక్రవారం డ్రై-డేగా పాటించాలని, ఇల్లు, ఇంటి పరిసరాల్లోని నిల్వ నీటిని పూర్తిగా తొలగించాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా నేతృత్వంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి జర్వాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ, డయేరియా, మలేరియా రాపిడ్ టెస్టులను నిర్వహించారు. దోమల ల్వారా నివారణకు, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. ఫీవర్ సర్వేలో సీహెచ్‌వో ఎం.ఫణికుమార్, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బాపులపాడులో ఇంట్లో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠము విజయవాడ
ఈ రోజు సా॥ గం॥6.30 ని॥ లకు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'ఉగాది పురస్కార' గ్రహీత,
నాట్యాచారిణి శ్రీమతి ఎస్.వి.శివకుమారి బృందంచే
"శ్రీ షిరిడి సాయి దివ్య చరితము"
కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన
సిద్ధార్థ ఆడిటోరియం లో జరుగును. అందరూ ఆహ్వానితులే



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com